
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
సోమవారం 3 నవంబరు 2025

నర్సన్న వలస బతుకు

- కుమారుడికి బడి చదువు
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- మరికల్‌లో 'వలస బతుకు' పుస్తకావిష్కరణ

6


మాట్లాడుతున్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి

వెయ్యేళ్ల నాటి శివలింగాలను కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి


గుడిబండ శివాలయం సమీపంలోని బండపై పాదాలను పరిశీలిస్తున్న డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

6

ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాలు.. క్రీడాకారులకు వరం

- ఉమ్మడి జిల్లాలో 5 కేంద్రాలు
- 3 ఫుట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ సెంటర్లు
- క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
- వెలుగులోకి వస్తున్న ఆణిముత్యాలు


మహబూబ్‌నగర్ స్టేడియంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

7

బాలల రక్షణే.. చైల్డ్‌లైన్ లక్ష్యం

- మైనర్లకు వివాహం చేసినా.. పనిలో పెట్టుకున్నా కఠిన చర్యలు
- బాల్య వివాహానికి హాజరైనా కేసులు
- ఈ ఏడాదిలో 379 కేసుల పరిష్కారం
- 315 అవగాహన కార్యక్రమాలు



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్-1098 సిబ్బంది (ఫైల్)

గద్వాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని చైల్డ్‌లైన్-1098 జోగుళాంబ గద్వాల జిల్లాలో సేవలందిస్తోంది. మైనర్లను వేధించడం, బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకొని పరిష్కారం చేస్తున్నారు. బాలల హక్కులపై, చట్టాలపై పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



బాలకార్మికులను గుర్తిస్తున్న అధికారులు(ఫైల్)

ఈ ఏడాది..

జోగుళాంబ గద్వాల జిల్లాలో చైల్డ్‌లైన్-1098 ద్వారా 2025 జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 50 బాల్య వివాహాలను నిలిపివేసారు. లైంగిక వేధింపులు 39, అనాధ పిల్లలు 10 మంది, మిస్సింగ్ 29, బాలకార్మికులు 136, భిక్షాటన చేసే నలుగురు బాలలను గుర్తించారు. తల్లిదండ్రులు పట్టించుకోని పిల్లలు 2, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో 118 మంది బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించారు.

అవగాహన కార్యక్రమాలు..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈఏడాదిలో ఇప్పటివరకు 315 అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. బాలల హక్కులను కాపాడేందుకు జిల్లా సంక్షేమాధికారి కమలాదేవి ఆధ్వర్యంలో 9మంది సిబ్బంది జిల్లాకేంద్రంలో విధు లు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా అంగన్ వాడీల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అడుగడుగునా ఆటంకాలు

బాలలను పనిలో పెట్టుకుంటే వారిపై కేసులు చేసేందుకు వెళ్లినా.. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు వెళ్లినా మొదట అడ్డగించేది కొందరు ప్రజాప్రతినిధులే.. అంతేగాక బాలకార్మికులను పట్టుకున్న వెంటనే ప్రజాప్రతినిధులు ఫోన్‌చేసి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే బాల్య వివాహాన్ని అడ్డుకునే క్రమంలో కూడా ఈ వివాహం మా పార్టీ కార్యకర్తలకు సంబంధించినది వెంటనే అక్కడి నుంచి వెళ్లండని చెబుతున్నట్లు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ చైల్డ్‌లైన్-1098కు కొన్ని ప్రాంతాల్లో అడుగడుగునా అడ్డంకులే వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

బాలల హక్కులను కాపాడుతాం..



బాలల హక్కులను కాపాడటమే మా లక్ష్యం.. ఎక్కడైనా బాలకార్మికులు ఉంటే వారిని బడిలో చేర్పించడం, బాల్యవివాహాలు జరుగుతుంటే అడ్డుకుని బాలికలను చిల్డ్రన్‌హోంకు తరలిస్తున్నాం. అక్కడి నుంచి స్టేట్‌హోంకు పంపించి మళ్లీ వారిని పాఠశాలలో చదివేలా చేస్తున్నాం.

- సునంద, జిల్లా సంక్షేమాధికారి, గద్వాల

తుఫాను బాధితులను ఆదుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ


ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (నక్కలగండి) జలాశయంలో మర్లపాండు తండా పూర్తిగా ముంపునకు గురైందనే విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. వరద ప్రాంతాల్లో నష్టంపై నివేదిక సిద్ధం చేసి త్వరగా అధికారుల ద్వారా పంపించాలని సీఎం సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.


ఎస్ఎల్‌బీసీ టన్నెల్ (ఫైల్)

ఎస్ఎల్‌బీసీ పనుల్లో కదలిక

- నేడు నల్లమలలో ఎన్‌జీఆర్ఐ బృందంతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సర్వే
- గతేడాది ఫిబ్రవరి 22న టన్నెల్‌లో జరిగిన ప్రమాదం దృష్ట్యా నిలిచిన పనులు

నాగర్‌కర్నూల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ పనుల్లో క్రమంగా కదలిక వస్తుంది. ఫిబ్రవరి 22న దోమలపెంట వద్ద ఇన్‌లెట్‌లో ప్రమాదం జరిగిన తర్వాత నిలిచిపోయిన పనులను తిరిగి పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. ఇటీవల జరిగిన క్యాబినేట్ సమావేశంలో బ్లాస్టింగ్ విధానంలో పనులను ముందుకు తీసుకెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెలిసిందే. ఇందు కోసం ఎలక్ట్రో మాగ్నెటికల్ సర్వేకు ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం ఇందు కోసం డీపీఆర్‌ను కూడా ఆమోదించింది. ఫిబ్రవరి 22న దోమలపెంట ఇన్‌లెట్‌లో టన్నెల్ కూలిన ప్రమాదంలో జయప్రకాశ్ ఇంజనీరింగ్, అమెరికాకు చెందిన రాబిన్ కంపెనీలకు చెందిన వారు 8మంది మృతి చెందిన విషయం తెలిసిందే. దాదాపు రెండు నెలల పాటు టన్నెల్‌లో జరిగిన అన్వేషణ అనేక కారణాలతో కొలిక్కిరాలేదు. ఈ క్రమంలో గురుప్రీత్‌సింగ్, మనోజ్‌కుమార్‌ల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. మిగతా ఆరుగురి ఆచూకీ ఇప్పటి వరకు లభ్యం కాలేదు. డేంజర్ జోన్ కంటే ముందుకెళ్తే టన్నెల్‌లో మిగతా భాగాలు కూడా కుప్పకూలి అన్వేషణ బృందాలకు కూడా ప్రాణ నష్టం కలుగుతుందని జువాలజీకల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణుల బృందం నివేదిక ఇవ్వడంతో ప్రభుత్వం ముందడుగు వేయలేదు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఎన్‌జీఆర్ఐ బృందంతో కలిసి నిర్వహించనున్న సర్వే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి నల్గొండ జిల్లాలో దాదాపు 7లక్షల ఎకరాలకు సాగునీరందించి తమ నిబద్ధతతను నిరూపించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శతవిధాలా కృషి చేస్తుంది. ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్, అవుట్‌లేట్లల్లో మిగిలి ఉన్న 9.135కిలో మీటర్ల టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పర్యావరణానికి హానీ కలుగకుండా బ్లాస్టింగ్ విధానాన్ని అవలంబించాలని భావిస్తున్న ప్రభుత్వం రేపు కీలకమైన సర్వేలో పర్యావరణ వేత్తలతో భాగస్వామ్యాన్ని పంచుకోనుంది.

జోగుళాంబ ఆలయంలో భక్తుల రద్దీ

అలంపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానాల్లో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే భక్తుల రద్దీ నెలకొంది. స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుష్కర ఘాట్ వద్ద తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించి నదిలో కార్తీక దీపాలను వదిలారు. అలాగే స్వామి, అమ్మవారి ఆలయాల ముందు కార్తీక దీపాలను వెలిగించారు. స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శ దర్శనం, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు చేశారు.


జోగుళాంబ ఆలయం ముందు దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చెరుకు కోతలకు సిద్ధం

- జిల్లాలో 8వేల ఎకరాలకు పైగా సాగు
- రెండు లక్షల టన్నులకు పైగా దిగుబడి



7

దళారుల చేతిలో మోసపోవద్దు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తుందని అన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన లేకుండా తమ పంటను సమీప కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

అభివృద్ధికి నోచుకోని అనుబంధ గ్రామాలు

- గ్రామ పంచాయతీ శివారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు


చింతల క్యాంపు నుంచి పెద్దతాండ్రపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి

రాజోలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు అనుబంధంగా ఉండే (మజారా) గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పంచాయతీలకు నిధులు వచ్చినా.. ప్రజాప్రతినిధులు ఆ గ్రామాలపై చిన్నచూపు చూడటంతో సమస్యలు మెరుగుపడటం లేదు. అనుబంధ గ్రామాల కోసం ప్రత్యేకంగా నిధులు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలో దాదాపు 25 గ్రామాలకు పైగా కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు.

తాగునీటికీ ఇబ్బందే..

రాజోలి మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామానికి అనుబంధ గ్రామమైన చింతలక్యాంపునకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించలేదు. మిషన్ భగీరథ నీరు కూడా సరిగా సరఫరా చేయడం లేదు. గ్రామంలో సీసీ రహదారులు, మురుగు కాలువలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా తుమ్మిళ్ల గ్రామానికి అనుబంధ గ్రామమైన ఆశోక్‌నగర్‌కు కంకర తేలిన రోడ్డు ఉండటంతో అత్యవసర సమయంలో నానా ఇ బ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన రాజోలికి అనుబంధ గ్రామమైన తుమ్మలపల్లి వాసులు రేషన్ సరుకులకు తీసుకోవాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అనుబంధ గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక పంచాయతీ కావాలి



చింతల క్యాంపు నుంచి పెద్ద తాండ్రపాడుకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. బీటీ రోడ్డు వేయించాలని పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. మజారా గ్రామమైన చింతల క్యాంపును ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి.

- విశ్వనాథ్, (చింతల క్యాంపు)

శ్రీశైలం టు హైదరాబాద్ రాకపోకలు ప్రారంభం


మరమ్మతులు చేసిన రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

ఉప్పునుంతల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని హైదరాబాద్ టు శ్రీశైలం ఎన్‌హెచ్ 765కే పై రాకపోకలు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఉప్పునుంతల మండలంలోని లత్తీపూర్ శివారులోని డిండి ప్రాజెక్టు అలుగు వద్ద శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై 500 మీటర్లు పొడవు ఉన్న బ్రిడ్జి 500 అడుగుల మేర కోతకు గురైంది. పోలీసులు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అధికారులు వాహనాలను హాజీపూర్ మీదుగా హైదరాబాద్ వైపు మళ్లించారు. గురువారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు రాత్రి పగలు తేడా లేకుండా మూడు రోజులు పాటు మట్టి పోసి రోడ్డు మరమ్మతులు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి శ్రీశైలం- హైదరాబాద్ అచ్చంపేట హైదరాబాద్ తదితర ప్రాంతాల వాహనాల రాకపోకలు ప్రారంభించినట్లు అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు తెలిపారు.

జన జాతర

- ఆదివారం సెలవు రోజు పెరిగిన భక్తుల రద్దీ
- కిటకిటలాడిన కురుమూర్తి జాతర మైదానం


కురుమూర్తి జాతరలో భక్తుల రద్దీ

చిన్నచింతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం, తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రతిరూపమైన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. స్వామి దర్శనం కోసం రాజగోపురం నుంచి కాంచన గుహ వరకు వరకు బారులు తీరారు. కోనేరులో స్నానాలు ఆచరించి, రేకుల షెడ్లలో, గుట్టల్లో చెట్ల కింద భక్తులు దాసంగాలు పెట్టి, స్వామి నైవేద్యాలు సమర్పించారు. జాతర మైదానంలో వెలిసిన వివిధ రకాల దుకాణ సముదాయాల వద్ద సందడి నెలకొంది. గాజుల దుకాణాలు రద్దీగా మారాయి. మటన్ దుకాణాలు కిటకిటలాడాయి.

స్వామి సన్నిధిలో రంగారెడ్డి కలెక్టర్

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి దంపతులు, మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్ కుమార్ స్వామిని దర్శించుకున్నారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్లయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.


స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 120.00
హోల్ సేల్	: 129.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

ఘనంగా ఆర్ఎస్ఎస్ శత జయంతి

● పాలమూరు నగరంలో భారీ కవాతు
● పాల్గొన్న ఎంపీ డీకే అరుణ


కవాతులో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మహబూబ్‌నగర్‌లో ఆదివారం శత జయంతి ఉత్సవలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కర సేవకులు ర్యాలీ న్విహించారు. ఈ ర్యాలీని వీర న్నపేట నీలకంఠ స్వామి ఆలయంలో వద్ద బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. ఈ కవతు పాలమూరు ఐదు మండలాలుగా ఏర్పాటు చేసి ఐదు దిక్కుల నుంచి కవతు సాగింది. వీరన్నపేట నీలకంఠస్వామి ఆలయం నుంచి ప్రతిభ స్కూల్ వరకు, కోయిలకొండ క్రాస్‌రోడ్డు నుంచి బోయపల్లి మీదుగా మోడల్ బేసిక్ స్కూల్ వరకు, అప్పన్నపల్లి నుంచి శ్రీనివాసకాలనీ వరకు, మర్లులోని నలంద ఆటో స్టాండ్ నుంచి శ్రీనివాసకాలనీ వరకు సాగింది. శ్రీనివాస్‌కాలనీ జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ పాల్గొని కరసేవకులను అభినందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు పద్మజారెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సన్న వలస బతుకు

● కుమారుడికి బడి చదువు
● సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి
● 'వలస బతుకు' పుస్తకావిష్కరణ


వలస బతుకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

మరికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నర్సన్నది వలస బతుకే అయినా, కొడుకును మాత్రం చదువు కోసం బడికి పంపించారని, అతడు కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. దివంగత నర్సన్న రచించిన 'వలస బతుకు (పాలమూరు వలస కూలీ జీవనగాథ) పుస్తకావిష్కరణ సభ ఆదివారం నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో పాటు, ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సన్న ఏడవ తరగతి వరకు చదువుకున్నాడని తెలిపారు. అయన భజన, కోలాటం పాటలే కాకుండా పీర్ల పండుగ పాటలను కూడా పాడే వారన్నారు. అంతే కాకుండా ఆయన మంచి కళాకారుడని, పౌరాణిక నాటకాల్లో బ్రహ్మం గారు, రాముడు, ఆంజనేయుడు తదితర పాత్రలను పోషించేవారని తెలిపారు. ప్రతీ శనివారం దేవాలయాల్లో సంకీర్తనలు పాడేవారని గుర్తు చేశారు. తన లోపలి కళాకారుడిని కాపాడుకుంటూ, ప్రదర్శించుకుంటూ మరికల్ ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. తాను వలస కూలీగా పని చేస్తూనే, కుమారుడు ఉన్నత స్థాయికి ఎదగడానికి ఎంతో కృషి చేశారన్నారు. కొడుకు వెంకట్రాములు ఉన్నత చదువులు చదివి, ఉపాధ్యాయ వృతిని ఎంచుకున్నారన్నారు. ఈ సందర్భంగా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాడిన జానపద గేయాలు అందరినీ ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్, పుస్తక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్, డీజీ హైమావతి, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, నాయకులు ఎండీ ఇక్బాల్‌పాషా, తిమ్మప్ప, వెంకట్రాములు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పరు పట్టివేత

కొత్తపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పరును పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని లింగాల్‌చెడ్ గ్రామంలో పట్టుకున్నట్లు మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. కోయిలకొండ మండలం సూరారం వాగులో సోమవారం తెల్లవారుజామున టిప్పరు ఇసుకతో గుండుమాల్ వైపు వెళ్తుండగా మద్దూరు పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ శివకుమార్, యజమాని వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లేగదూడను ఎత్తుకెళ్లిన పులి

నవాబ్‌పేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మగండ్ల గ్రామంలో పెద్దపులి లేగదూడను హతమార్చి ఎత్తుకెళ్లడంతో గ్రామంలో అలజడి నెలకొంది. గ్రామానికి చెందిన కోస్గి సురేష్ తన పశువులను శనివారం సాయంత్రం దేవరగుట్ట సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారుజామున పొలానికి వెళ్లి చూడగా అందులో ఓ దూడ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆయన చుట్టు పక్కల వెతికినా ఆనవాలు కనిపించలేదు. దీంతో తాడును పరిశీలించగా తాడు తెగి ఉండటం చూసి పులి ఎత్తుకెళ్లినట్లు నిర్ధారణకు వచ్చాడు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు.

సొంతింటి కల సాకారం

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
● పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన


హన్వాడ మండలం గుడిమల్కాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

హన్వాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేరడం ఆనందకరమని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుడిమల్కాపూర్‌లో రూ.30 లక్షలు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెద్దదర్పల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నేరవేరుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి రావడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు ఎస్సీ వెంకటేష్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, టంకర కృష్ణయ్య, నవనీత, దేవేందర్, రామస్వామి, యాదయ్య, వెంకట్‌రెడ్డి, కలీం, విజయ్‌నాయక్ పాల్గొన్నారు. అంతకు ముందు దాచకపల్లిలో ధ్యాన పిరమిడ్ 13వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని బ్రోచర్ విడుదల చేశారు. పూర్తి స్థాయిలో ప్రజలకు ధ్యానం గురించి తెలియజేయాలన్నారు. మనసును నియంత్రించగలిగేతే సగం సమస్యలు పరిష్కారవ అవుతాయన్నారు. ప్రతీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల అనుమతితో ధ్యాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హన్వాడలో ఆదివారం రాత్రి యాదవులు నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సదర్‌ను కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. యాదవ సంఘం నాయకులు కృష్ణయ్య, వెంకటాద్రి, వెంకటయ్య, దస్తయ్య పాల్గొన్నారు. చిన్నదర్పల్లి మునిసిపల్ వార్డు పూజారి తండాలో మారెమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

● సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రాజు
● ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక


ఉమ్మడి జిల్లా జట్టుతో సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రాజు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రాజు అన్నారు. జగిత్యాలలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి మహిళా జట్ల ఎంపికలను ఆదివారం జిల్లా స్టేడియంలో నిర్వహించారు. జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అమరేందర్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది సాఫ్ట్‌బాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. సాఫ్ట్‌బాల్ టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి టోర్నీకి సుజాత, మంజుల, భార్గవి, శిరీష, తులసీ, కాంచన, కీర్తి, నిఖిత, పి.నిఖిత, రోష్ని, మనీషా, వర్షిత, మహేశ్వరి, శిరిషరాణి, పల్లవి, శివజ్యోతి, స్వేత, ఎం.వర్షితను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం సెక్రటరీ శరత్‌చంద్ర, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రామవేందర్, నాగరాజు, సుగుణ పాల్గొన్నారు.



గంజాయి తరలిస్తున్న ముఠా పట్టివేత?

కృష్ణ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకున్న ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని కుస్సీ గ్రామం శివారులో 150వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. గంజాయి తరలిస్తున్న విషయాన్ని ముందుగానే పసిగట్టిన పోలీసులు పక్కా సమాచారం అందుకుని మాటు వేసి నలుగురు యువకులను పట్టుకున్నట్లు తెలిసింది. కర్ణాటక రాష్ట్రం రాయచూర్, యాదగిరి జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు, నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకుని స్టేషన్‌కు తరలించి రహస్యంగా విచారణ నిర్వహిస్తున్నారు. సమాచారం బయటికి వెళ్లకుండా పకడ్బందీగా పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

వెయ్యేళ్ల నాటి శివలింగాలను కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

బల్మూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొండనాగుల గ్రామ సమీపంలోని గుడిబండ గ్రామ శివారులో గల పురాతన శివాలయం ముందున్న బండపై చెక్కిన పాదాలు, శివలింగాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గంగాగౌరీ రామలింగేశ్వరాలయ కమిటీ అధ్యక్షుడు అంబటి లింగమయ్య ఇచ్చిన సమాచారం మేరకు శివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఆలయం ముందు బండపై పాదాలు, ఆరు చిన్న శివలింగాలు చెక్కి ఉన్నాయని తెలిపారు. అవి కళ్యాణీ చాళుక్యుల(సా.శ.11వశతాబ్దం) కాలం నాటివని, చరిత్రపై అవగాహన లేని క్వారీ పని వాళ్ల వల్ల ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం గల ఈ శిల్పాలను కాపాడి భావితరాలకు అందించాలన్నారు. ఈ ప్రాంతంలో మండలంలో అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాగుపరిచే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాట్రాజు తిరుపతయ్య, అంబటి నరసింహ, నిమ్మలరాజు, తెలుగు ఎల్లయ్య, శిల్పి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే అందులో భాగస్వాములైన ప్రతీ ఒక్కరిపై కేసు నమోదు చేస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం- 2006 ప్రకారం బాల్య వివాహానికి అనుమతినిచ్చినా, ప్రోత్సహించినా.. వివాహాన్ని నిర్వహించినా, హాజరైనా అందరిని నిందితులు గానే పరిగణించబడతారని హెచ్చరించారు.

బాల్య వివాహలను అరికట్టడానికి జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజనల్ స్థాయిలో ఆర్డీఓ, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీఓ, మండల స్థాయిలో తహసీల్దార్, సెక్టార్ స్థాయిలో సూపర్‌వైజర్, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి లేదా వీఆర్వో బాల్య వివాహ నిషేధ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిపించడానికి ప్రయత్నం చేసినట్లయితే చైల్డ్ లైన్ 1098 లేదా 100కు ఫోన్ చేసి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

కబడ్డీ క్యాంపును పరిశీలించిన డీవైఎస్‌వో


కబడ్డీ క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీవైఎస్‌వో కృష్ణయ్య

గద్వాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఆదివారం డీవైఎస్‌వో కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ కబడ్డీ అసోసియేషన్ వారు నిర్వహించే శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నరసింహ, సంయుక్త కార్యదర్శి జగదీష్, సీనియర్ క్రీడాకారులు మహేష్, పేపర్ నరసింహ, శివశంకర్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలి

● రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్
● జిల్లా కేంద్రంలో మూడో మహాసభలు



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

గద్వాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వర్కర్లకు రూ.10వేలు వేతనం ఇవ్వాలని టీయూసీఐ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. భోజన వర్కర్స్ యూనియన్ జిల్లాస్థాయి మూడవ మహాసభలు ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించారు. మహాసభకు హాజరైన టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ, కార్మికులకు వేతనపరంగా తగిన న్యాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం శ్రమదోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్ల రాయితీలను అందిస్తున్న కేంద్రం, కష్టపడే కార్మికులకు మాత్రం మొండిచేయి చూపుతుండటం దుర్మార్గమన్నారు. పైగా పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తూ కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే కుట్రలు చేస్తుండటం విచారకరమన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను ప్రతీనెల క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. మహాసభల్లో జిల్లా నాయకులు హనుమంతు, చింతరేవుల కృష్ణ, జీ కృష్ణ, నరేశ్, చంద్రాములు, రంగన్న, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్టీయూటీఎస్ జిల్లా నూతన కమిటీ బాధ్యులు

గద్వాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలు అవసరమని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర పూర్వఅధ్యక్షుడు పర్వత రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పర్వతరెడ్డి, ఏకీకృత సర్వీసు రూల్స్ సాధిస్తేనే ఎంఈవో, జేఎల్, డిప్యూటీ డీఈవోల పదోన్నతులకు మార్గం ఏర్పడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏల చెల్లింపు, పీఆర్‌సీ ప్రకటన, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధపడాలన్నారు. కాగా, 370 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ జోగుళాంబ గద్వాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులిపాటి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ యూనిస్ పాషా, ఆర్థిక కార్యదర్శిగా విజయ్ భాస్కర్, అడిషనల్ జనరల్ సెక్రటరీలుగా శ్రీహరి, ఎండి ఇస్మాయిల్, అసోసియేట్ అధ్యక్షులుగా కృష్ణయ్య, అమరేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా కిశోర్‌చంద్ర, జయరాజు, రఘు, రుక్మతుల్లా, మధుసూదన్, రమణమ్మ, జిల్లా కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, భాస్కర్, మహబూబ్ పాషా, సుదర్శన్, శ్రీలత, ఖాజామీర్, మల్లయ్య, నరసింహులు, ఆర్థిక కమిటీ సభ్యులుగా బద్రుద్దీన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా చెన్నకేశవులు, శంకర్‌నాయక్, గౌరీశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మురళి తెలిపారు. అనంతరం పూర్వపు అధ్యక్షుడు పర్వతరెడ్డి, రాష్ట్ర బాధ్యుడు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గం చేత ప్రమాణం చేయించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బల్మూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):మిత్రుడి అకాల మర ణం పట్ల చింతిస్తూ వారి కుటుంబానికి తోటి స్నేహితులు సహాయం చేశారు. మండల పరిధిలోని రామాజీపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఇటీవల మృతిచెందాడు. 1994-95బ్యాచ్‌కు చెందిన క్లాస్‌మేట్ మిత్రులు రూ.80వేలు జమ చేసి, లక్ష్మయ్య భార్య మానస, కూతురు కరుణశ్రీలకు అందజేశారు. కార్యక్ర మంలో మిత్రులు వెంకటస్వామి, షబ్బీర్, మల్లేష్, చంద్రశేఖర్, లక్ష్మీప్రసాద్, మల్లయ్య, నిరంజన్, కృష్ణయ్య, వెంకట్ ఉన్నారు.

పెద్ద రాములు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వీపనగండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పెద్ద రాములు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ అమరజీవి పెద్దరాములు సంస్మరణ సభను మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడారు. గ్రామంలో తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించారని, ఆయన జీవిత ప్రస్థానం ఎన్నో దాడులు ఎదుర్కొని సీపీఎం పార్టీని నిర్మాణం చేశారన్నారు. ఈ ప్రాంతంలో నరసింహ అనేక మంది చేసిన త్యాగాల నుంచే భవిష్యత్తు ఉద్యమ మొలకలు వచ్చాయన్నారు. పెద్ద రాములు ఆశయాల కోసం పునరంకితం కావడమే అందరికి మార్గం కావాలన్నారు. ప్రజా ఉద్యమాలే గీటు రాయిగా ముందుకు సాగాలన్నారు. ఈ సభలో సీపీఎం ఉమ్మడి మాజీ జిల్లా కార్యదర్శి కిల్లెగోపాల్, వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, సీనియర్ నాయకులు రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఎస్.గోపి, మండ్ల రాజు, జిల్లా కమిటీ సభ్యులు మహబూబ్‌పాషా, మండ్ల కృష్ణయ్య, బాల్యనాయక్, రమేష్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి తండ్రికి నివాళి


తన్నీరు సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహాం

వడ్డేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఆదివారం హైదరాబాద్‌లోని నివాసంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహాం పరామర్శించారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వడ్డేపల్లి మండల జడ్పీటీసీ మాజీ సభ్యుడు కాశపోగు రాజు, నాయకులు ఉన్నారు.

మైసమ్మ దేవతకు పూజలు


మైసమ్మ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామంలో మైసమ్మ దేవతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ ఆదివారం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. భక్తుల నుంచి అమ్మవారికి రూ.1,48,925 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో తెలిపారు.

బీసీ హాస్టల్‌లో పాము కలకలం

- భయాందోళనలకు గురైనా విద్యార్థులు


బీసీ హాస్టల్ గదిలో పాము

ఊర్కొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఊర్కొండపేట బీసీ హాస్టల్‌లో ఆదివారం పాము కలకలం రేపిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు గదిలోకి వెళ్తున్న పామును చూసి భయాందోళనలకు గురయ్యారు. వెంటనే హాస్టల్ సిబ్బందికి తెలిపారు. వారు వచ్చేసరికి గదిలో పుస్తకాల మధ్యకు వెళ్లింది. వెంటనే వారు కొట్టి చంపారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్ పరిసరాల్లో విషపురుగులు సంచరిస్తున్నాయని, రాత్రి సమయంలో నిద్రపోవాలంటే భయంగా ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు విషపురుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

కేఎల్ఐ కాలువలో
వృద్ధురాలి మృతదేహం లభ్యం


సాయమ్మ (ఫైల్)

బిజినేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా కనబడకుండా పోయిన కురువ సాయమ్మ (60) అనే వృద్ధురాలు కేఎల్ఐ కాలువలో శవమై తేలింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారు కొండ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం కేఎల్ఐ కాలువలో తేలిందని ఆదివారం పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన సాయమ్మగా గుర్తించి బంధువులకు తెలియజేశారు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ వృద్ధురాలు ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే.శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


లింగమయ్య (ఫైల్)

ఉప్పునుంతల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని జప్తిసదగోడు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట్ల చిన్న లింగమయ్య(54) గత శుక్రవారం గ్రామ సమీపంలోని చింతచెట్టుకు కాయలు తెంపేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గాయాలు కావడంతో వెంటనే హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మమ్మతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం, వాహనంతో రూరల్ ఎస్ఐ శ్రీకాంత్

గద్వాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గద్వాల నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున గద్వాల నుంచి రాయిచూర్ మార్గాన గోనుపాడు శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ధరూర్ గ్రామానికి చెందిన తెలుగు కృష్ణ గద్వాల నుంచి తన మినీ డీసీఎంలో 70 ప్లాస్టిక్ సంచులలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రాయిచూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. అతడిపై కేసు నమోదు చేయడంతో పాటు రేషన్‌బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

» పరిశీలించిన డీఎస్పీ


దొంగతనం జరిగిన కురుమూర్తి ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, పోలీసులు

కొత్తకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముమ్మళపల్లి గ్రామంలో ఐదు ఇళ్లలో దొంగతనాలు జరిగి వారం రోజులు గడవక ముందే వనపర్తి జిల్లా కొత్తకోటలో మరో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీకాంత్‌రెడ్డి తన కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో కలిసి హాస్పిటల్‌కు వెళ్లారు. గమనించిన దొంగలు రాత్రివేళ ఇంటికి తాళం వేసి చాకచక్యంగా తీసి బీరువాలో ఉన్నరెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. ఆదివారం ఇంటికి వచ్చిన లక్ష్మీకాంత్‌రెడ్డి తాళం ఊడి ఉండడాన్ని గమనించి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గ్రహించాడు.

అలాగే దండుగడ్డ కాలనీలో ఉంటున్న కురుమూర్తి కుటుంబ సభ్యులు అందరు కలిసి చెలిమిల్లకు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. తలుపులకు ధ్వంసమైన తాళం చూసి అవాక్కయ్యాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు విరగ్గొట్టి 12 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి గొలుసులు, రూ. 45 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. దొంగతనం జరిగిన ఇళ్లను డీఎస్పీ వెంకటేశ్వర్ రావు పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

బాలికతో నిశ్చితార్థం - కేసు నమోదు

వీపనగండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో బాలికకు వివాహం చేసేందుకు సిద్ధమైన నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... బొల్లారం గ్రామానికి చెందిన ఓ బాలికకు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేసేందుకు గత నెల 7న నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ విషయం తెలియడంతో పూర్తి సమాచారం సేకరించారు. బాలికను వివాహం చేసుకునేందుకు సిద్ధమైన వ్యక్తిపై, తల్లిదండ్రులపై బాల్య వివాహ నిషేధ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాలు..
క్రీడాకారులకు వరం

» ఉమ్మడి జిల్లాలో 5 కేంద్రాలు
» 3 ఫుట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ సెంటర్లు
» క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
» వెలుగులోకి వస్తున్న ఆణిముత్యాలు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి ఎదిగేందుకు కేంద్ర సర్కార్ 'ఖేలో ఇండియా' శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 5 శిక్షణ కేంద్రాలు మంజూరు చేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలకు ఫుట్‌బాల్ సెంటర్లు, నారాయపేటలో అథ్లెటిక్స్, కల్వకుర్తి పట్టణంలో కబడ్డీ సెంటర్లు 2023లో ప్రారంభమయ్యాయి. అండర్-12, 14, 17, 19 వయస్కుల విభాగంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో దాదాపు 200మందికి పైగా క్రీడాకారులు ఉదయం, సాయంత్రం ఫుట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్ కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. శిక్షకులకు కేంద్ర సర్కార్ ద్వారా నెలకు రూ.25 వేల వేతనం అందిస్తున్నారు. క్రీడాకారులు ప్రత్యేక శిక్షణ అందజేసి ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా తర్ఫీదు


మహబూబ్‌నగర్‌లో ఫుట్‌బాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు(ఫైల్)

ఇస్తారు. ఫుట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ తదితర టోర్నీల్లో పాల్గొనేలా క్రీడాకారులను తయారు చేస్తారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, జాతీయస్థాయి ఎక్స్‌లెన్సీ కేంద్రాలకు ఎంపిక చేస్తారు. అక్కడ క్రీడాకారులకు అత్యున్నత ప్రయాణాలతో శిక్షణ, భోజన వసతి, క్రీడా దుస్తులు, విద్య అందిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చి దిద్దుతారు.

- ప్రతిభను వెలికితీసి..
అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా..

ఖేలో ఇండియా ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ కబడ్డీ శిక్షణ కేంద్రాలు క్రీడాకారులకు వరంలాంటివి. పిల్లలను క్రీడల వైపు దృష్టి సారించేలా చేయటం, క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు. కేంద్రాల ఏర్పాటుతో ఎంతో మంది గ్రామీణ, పట్టణాల నుంచి ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. క్రీడా మైదానాలు నిర్మించి క్రీడల్లో భారతదేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా 'ఖేలో ఇండియా'ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఖేలో ఇండియాలో భాగంగా ప్రస్తుతం బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, హాకీ, టేబుల్‌టెన్నిస్, అథ్లెటిక్స్ కబడ్డీ, ఆర్చరీతో పాటు 26 క్రీడాంశాలు ఉన్నాయి. క్రీడాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించి, నిధులతో పాటు శిక్షకులు, అన్ని వసతులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి..



ఖేలో ఇండియా సెంటర్ రావటంతో ఎంతో మంది ఫుట్‌బాల్ క్రీడపై ఆసక్తి చూపుతున్నారు. సెంటర్ 30పైగా బాల, బాలికలు శిక్షణ తీసుకుంటున్నారు. సెంటర్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. స్టేడియం మైదానాల్లో మరిన్ని వసతులు కల్పిస్తే బాగుంటుంది.

- డి.నిఖేష్, ఖేలో ఇండియా సెంటర్, ఫుట్‌బాల్ కోచ్, మహబూబ్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి...



ఖేలో ఇండియా ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. బాల, బాలికలకు 42 మంది ఉదయం, సాయంత్రం కోచ్ నికేశ్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. కోచ్‌లను నియమించి వసతులు కల్పిస్తే మరికొందరు యువ క్రీడాకారులను తయారు చేయవచ్చు. ఇప్పటికే ఇండోర్‌స్టేడియంలో వివిధ క్రీడా అంశాల్లో ఉన్న కోచ్‌లతో శిక్షణ అందజేస్తున్నాం.

- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో

క్రీడాకారులకు మంచి అవకాశం...



ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాలు గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు వరం. అథ్లెటిక్స్‌లో అండర్-12, 14, 16 విభాగాల్లో ట్రయల్స్ నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నాం. 40 మంది క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు.

- హారికాదేవి, ఖేలో ఇండియా సెంటర్, అథ్లెటిక్స్ కోచ్, నారాయణపేట

పంటల సాగులో
శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలి

» పొలంబాట పట్టిన పీజీ విద్యార్థులు
» గ్రామీణ జీవనంపై పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల అధ్యయనం


ఆధునిక వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న పాలమూరు యూనివర్సిటీ పీజీ విద్యార్థులు

లింగాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని పీజీ విద్యార్థులు రైతులకు సూచించారు. గ్రామీణ ప్రజల జీవన విధానంపై అధ్యయనానికై పాలమూరు విశ్వ విద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థినీ విద్యార్థులు మూడు రోజులపాటు రూరల్ క్యాంపులో భాగంగా అప్పాయిపల్లి గ్రామంలో ఉంటూ ప్రజలను చైతన్యవంతులు చేసే కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం గ్రామంలో కాలినడకన ఇంటింటికి తిరుగుతూ ప్రజల జీవన విధానంపై సర్వే నిర్వహించారు. అనంతరం పొలంబాట పట్టిన విద్యార్థులు ఆధునిక వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను రైతులకు, గ్రామస్థులకు వివరించారు. రసాయనాల వినియోగంతో కలిగే నష్టాలు.. సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.పర్వతాలు, డాక్టర్ ఎం.గాలెన్న, సోషల్ వర్క్ విద్యార్థినీ విద్యార్థులు మచ్చేందర్, రాజేష్, ఎస్.శంకర్, ప్రశాంత్, గోపాల్, రాకేష్, బుగ్గప్ప, స్వప్న, విజయ, ఆశమ్మ, స్వాతి, మహేశ్వరి, అనూష తదితరులు పాల్గొన్నారు.

వేడివేడి చాయ్ పోసి దాడి

జడ్చర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని పర్షని హోటల్‌లో చాయ్ తాగడానికి వెళ్లిన సమీర్ అనే వ్యక్తిపై హోటల్ యజమాని మహ్మద్ వేడివేడి చాయ్ పోసి దాడికి పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... డ్రైవర్ వృత్తితో జీవనం సాగిస్తున్న పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన సమీర్ అనే వ్యక్తి శనివారం అర్ధరాత్రి సమయంలో పర్షని హోటల్‌లో చాయ్ తాగడానికి వెళ్లాడు. కాగా ఇదివరకే వారి మధ్య ఉన్న పాతకక్షల కారణంగా చాయ్ తాగడానికి వచ్చిన సమీర్‌పై 5లీటర్ల వేడి వేడి చాయ్‌ను పోశాడు. అనంతరం రాడ్‌తో తలపై దాడికి పాల్పడ్డాడు. సమీపంలోని కొందరు దాడిని నిలవరించి, గాయపడిన సమీర్‌ను చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ కమలాకర్ వివరించారు.

కారును ఢీకొట్టిన మరో కారు

మూసాపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని 44వ జాతీయ రహదారి శాఖాపూర్ ఎల్‌అండ్‌టీ టోల్ ప్లాజా వద్ద ముందుగా ఆగి ఉన్న కారును మరోకారు ఢీకొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు.. షేక్ రియాజ్ తన కుటుంబ సభ్యులతో మహబూబ్‌నగర్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్నారు. టోల్‌ప్లాజా దాటగానే డ్రైవర్ మారడానికి ఆగి ఉండగా అంతలోనే అదేవైపు పోతున్న మరో కారు వెనకినుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రియాజ్, కలీమాలు గాయపడ్డారు. కారు ధ్వంసమైందని, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ శివపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మర్లపాడుతండాను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే


మర్లపాడుతండాలో గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరకులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అచ్చంపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సందర్భంగా కురిసిన భారీ వర్షంతో అచ్చంపేట మండలం మర్లపాడుతండా గ్రామపంచాయతీ పక్కనే ఉన్న నక్కలగండి రిజర్వాయర్‌లో ఒక్కసారిగా వరద నీరు చేరింది. మర్లపాడుతండా మొత్తం మునిగిపోయింది. దీంతో తండాను అచ్చంపేట బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ముంపునకు గురైన తండా మొత్తాన్ని కలియదిరిగి వరదలో కూరుకుపోయిన ఇళ్లను పరిశీలించారు. రైతులు ఇళ్లలో పెట్టుకున్న పత్తిని ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తండావాసులను నేరుగా కలిసి వారికి ధైర్యం చెప్పారు. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారి ఆకలి తీర్చడానికి తన ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తండాలో ఉన్న 200కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వరదలో మొత్తం తండా ముం పునకు గురైన ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. వెంటనే ప్రతీ కుటుంబానికి ఆర్థిక సహాయమందించాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు పోకల మనోహర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు


ఎంపికైన జిల్లా క్రీడాకారిణులు

గద్వాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మాణిక్య, స్వాతి, పవిత్ర ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ సోమ వారం నుంచి వికారాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన పాఠశాల క్రీడాకారిణులను ప్రధానోపాధ్యాయుడు జహీరుద్దీన్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

» బంగారు, వెండి ఆభరణాలను లాక్కొని హత్య చేశారనే అనుమానాలు
» క్లూస్ టీంతో పరిశీలిస్తున్న పోలీసులు


క్లూస్‌టీంతో వివరాలను సేకరిస్తున్న పోలీసులు


బలిజ లక్ష్మి(ఫైల్)

గద్వాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భర్త దుకాణానికి వెళ్లి వచ్చేలోగా తన భార్య బలిజ లక్ష్మి (52) ఇంట్లో శవమై కనపడడంతో షాక్‌కు గురైన భర్త మల్లికార్జున్ వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని షేరెల్లివీధికి చెందిన మల్లికార్జున్ ప్రతిరోజు లాగానే ఆదివారం తన ఫర్టిలైజర్ దుకాణానికి ఉదయం 10 గంటల సమయంలో వెళ్లాడు. అయితే మధ్యాహ్నం 2 గంటలకు భోజనానికి ఇంటికి వచ్చాడు. తన భార్య ఇంట్లో విగతజీవిగా పడి ఉంది. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించాడు. అయితే, ఆమె ఒంటిపై ఉన్న నాలుగన్నర తులాల బంగారు గొలుసు, కాళ్లకు ఉన్న వెండి కడియాలు, పట్టీలు లేకపోవడం గమనించాడు. అంతేకాక తన భార్య ఒంటిపై గాయాలుండటంతో బంగారు, వెండి ఆభరణాల కోసం ఎవరో హత్యచేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంఘటన స్థలాన్ని సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ, రూరల్ ఎస్ఐలు కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు, క్లూస్‌టీం సిబ్బంది పరిశీలించారు. అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో పరిశీలించి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు



నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు నియామకమయ్యారు. ఇప్పటి వరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా పని చేసిన ఎం.పాండు పదవీవిరమణ చేయడంతో ఆయన స్థాయిలో అచ్చంపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఎస్ఏ పీడీగా పని చేస్తున్న నాగేశ్వర్‌నావును నియమిస్తూ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా నూతన కార్యదర్శి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ఎస్‌జీఎఫ్ పోటీల విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు నియామకం కావడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి సామా రమేష్‌తో పాటు పలువురు పీఈటీలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

'నిరసన దీక్షను విజయవంతం చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత పది సంవత్సరాల నుంచి రెడ్ల సంక్షేమం, ఐక్యత, రిజర్వేషన్ తదితర సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న తెలంగాణ రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండకింద మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాదు ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ఈ నిరసన దీక్షలో జిల్లాలోని రెడ్డి సామాజిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

» ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్
» నాగర్‌కర్నూల్‌లో గేదెకు వినతిపత్రం అందజేసి నిరసన


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గేదెకు వినతిపత్రం అందజేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గేదెకు వినతిపత్రం అందజేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దామెర కిరణ్ మాట్లాడుతూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.900 కోట్లు అయినా విడుదల చేసి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. బకాయిలు ఉన్నాయనే పేరుతో ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, సర్టిఫికెట్స్ అడిగితే పెండింగ్ ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రవేటు విద్యా సంస్థలకు గ్యారెంటీ ఇచ్చి వేధింపులకు పాల్పడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ.సయ్యద్, కార్యదర్శి తారాసింగ్, నాయకులు రామానుజన్, వంశీ, చరణ్, మహేష్, సిద్దు, హేమంత్, భరత్, పరమేష్, సంతోష్, రామ్‌చరణ్, పృథ్వీరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు కోతలకు సిద్ధం

» జిల్లాలో రెండు లక్షల టన్నులకు పైగా దిగుబడి
» 8వేల ఎకరాలకు పైగా సాగు

అమరచింత, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో చెరుకు కోతలకు రైతులు సిద్ధమవుతున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఈసారి జిల్లాలో రికార్డు స్థాయిలో కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో దాదాపు 8 వేల ఎకరాలకు పైగా పంటను సాగు చేసి రెండు లక్షల టన్నులకు పైగా చెరుకు దిగుమతికి సిద్ధమవుతున్నారని చెప్పవచ్చు. ఈనెల మొదటి, రెండవ వారంలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ప్రత్యేక కూలీలచే చెరుకు కోతలు ప్రారంభించడానికి అటు ఫ్యాక్టరీ యజమానులు, ఎటు రైతులు సిద్ధమవుతున్నారని చెప్పవచ్చు.

● మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి కూలీలు

ఈనెల మొదటి రెండవ వారంలో ప్రారంభమయ్యే చెరుకు కోతల కోసం మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రత్యేక కూలీల బ్యాచ్‌లను దించనున్నారు. ముఖ్యంగా ఒక్కొక్క బ్యాచ్‌లో కూలీలు 20 నుంచి 26 మంది దాకా ఉంటారు. ఇలా 100 బ్యాచులు కోతల కోసం వస్తారు. కూలీలతో పాటు ఈసారి 14 మిషన్లను ఉపయోగించనున్నారు. ఇప్పటికే కూలీలను ఫ్యాక్టరీ అధికారులు ఆయా ప్రాంతాల్లో బృందాలుగా విడదీసి వారికి ఆశ్రమం కల్పించే ప్రణాళిక చేస్తున్నారు. కూలీల రాక మొదలైంది.

● జిల్లాలో పెరిగిన సాగు

జిల్లాలో ఈసారి రికార్డుస్థాయిలో చెరుకు పంటను రైతులు సాగు చేశారని చెప్పవచ్చు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో గత ఏడాది 6500 ఎకరాల్లో మాత్రమే సాగు చేయగా ఈసారి 8000 ఎకరాలకు పైగా చెరుకు సాగు చేయడంతో పాటు రెండు లక్షల 60వేల టన్నుల దిగుమతి ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.

● మద్దతు ధరపై పెరుగుతున్న డిమాండ్

ఈ ప్రాంతంలో మరింత చెరుకు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం చెరుకుకు మద్దతు ధర అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెరుకు రైతు ఆయా సంఘం నాయకులు డిమాండ్ చేసున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.8130 ప్రకటించిన మాదిరిగా చెరుకు పంటకు సైతం క్వింటాల్ కు రూ.6వేల మద్దతు ధర ఇవ్వాలని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం చెరుకు సంఘాల పోరాటాల మేరకు గత ఏడాది క్వింటాల్ చెరుకు రూ.3367 నుంచి ప్రస్తుతం ఈసారి బోనస్‌తో కలిసి రూ.3924 ధర మాత్రమే ఫ్యాక్టరీ అధికారులు అందిస్తున్నారు. ఏదేమైనా వరికి ప్రత్యామ్నాయంగా పెరుగుతున్న చెరుకు పంట సాగుకు ప్రభుత్వం మద్దతు ఇవ్వడంతో పాటు రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచిస్తే భవిష్యత్తులో మరింత సాగయ్యే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు.


పంట పొలాల్లో గుడారాలు వేసుకున్న ఇతర రాష్ట్రాల కూలీలు(ఫైల్)


కోత పనుల్లో కూలీలు (ఫైల్)

● రైతులను పట్టించుకోవాలి

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పత్తి రైతుల మాదిరిగా చెరుకు రైతులను పూర్తిస్థాయిలో పట్టించుకోవాలి. పత్తికి ఇచ్చిన మాదిరిగా చెరుకుకు రూ.6వేలు మద్దతు ధర కల్పించాలి. చెరుకు రైతుల అన్ని స మస్యలను ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమా న్యం పరిష్కరించాలి.

● కె.రాజన్న, కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

● టన్నుకు రూ.1000 బోనస్ ఇవ్వాలి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా టన్ను చెరుకు రూ.1000 బోనస్ తక్షణమే కల్పించాలి. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా నేటికి బోనస్ ఇవ్వడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేయాలని, లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతాం.

● జీఎస్ గోపి, తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

న్యూస్ బాక్స్

అయ్యప్ప స్వాములకు సరుకుల అందజేత



స్వాములకు వంట సామగ్రి ఇస్తున్న భక్తులు

గద్వాలఅర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీలో కొలువైన అయ్యప్ప స్వామి ఆలయానికి పట్టణంలోని భక్తులు వంట సరుకులను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.కార్తీక మాసం పురస్కరించుకుని అయ్యప్ప మాలధారులకు బియ్యం, వంటనూనె, వంటలకు ఉపయోగించే సరుకులను అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బాలుర వసతి గృహం తనిఖీ



వసతిగృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, కేజీబీవీ పాఠశాలను ఆదివారం ఎంఈవో రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాన్ని పరిశీలించిన ఎంఈవో భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేసిన ఎంఈవో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలని సూచించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయిజలోని గద్వాల రహదారిలో ఉన్న సబ్‌స్టేషన్ ఆవరణలో 3న సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అయిజ ఏడీఈ నీలిగోవింద్ తెలిపారు. కార్యక్రమంలో అయిజ గట్టు, మల్దకల్, రాజోలి మండలాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని, సమస్యలను తమ దృష్టికి తేవాలని కోరారు.

రాజోలిలో భగవద్గీత ప్రవచనం

రాజోలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలిలోని శ్రీ భ్రమరాంబికా సమేత ఆదివేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్చకుడు ఆదివి స్వామి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రాముఖ్యత, ప్రవచనాలపై భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖులు శుద్ధగణ కృష్ణదాస్ పండితుడు దామోదర లీల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు ఆయన భగవద్గీత ప్రాముఖ్యత, హరినామ జప విశిష్టత, దామోదర లీల ప్రవచనాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరూ భగవద్గీత చదవాలని, అందులోని మంచిని గ్రహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, సువర్ణ, కృష్ణ ప్రియ, భరత్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాల్యాన్ని ఉల్లాసంగా గడపాలి

● ఏపీఎం జయాకర్



కిశోర బాలికలకు బహుమతులు ఇస్తున్న మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాసమ్మ

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాల్యాన్ని చదువు, క్రీడలతో ఉల్లాసంగా గడపాలని ఏపీఎం జయాకర్ తెలిపారు. ఆదివారం అయిజ వెలుగు కార్యాలయ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన 14 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు వయస్సు గల కిశోర బాలికలకు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నృత్యం, ఆట, పాటలకు సంబంధించిన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. వీటిని వ్యతిరేకించాల్సిన బాధ్యత మనదే అన్నారు. పెద్దలను గౌరవిస్తూ, పిల్లలను ప్రేమిస్తూ ఉండాలని తెలిపారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని చదువుతూ ఆట, పాటలతో ఉన్నత స్థానాన్ని దక్కించుకోవాలని ఈ సందర్భంగా బాలికలకు సూచించారు.

క్రీడా పోటీల విజేతలకు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాసమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీసీలు సుదర్శన్, ఆంజనేయులు, సీని యర్ సీఆర్పీలు శ్రీలత, నర్మద తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే రాకపోకలకు అంతరాయం

● కోట్లు ఖర్చు చేసి ఆర్‌యూబీ నిర్మాణం

● నేటికీ తీరని సమస్య

● రాత్రివేళ ప్రమాదాలతో ఇబ్బందులు



గోపలదిన్నె గ్రామ సమీపంలో వంతెన కింద నిలిచిన వర్షపునీరు

ఇటిక్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రూ.కోట్లు వ్యయం చేసి ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే అండర్ గ్రౌండ్ వంతెనల నిర్మాణం చేపట్టినా సంబంధిత గుత్తేదారులు సక్రమంగా పనులు చేయకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నట్లు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటిక్యాల మండల పరిధిలో గోపలదిన్నె గ్రామ శివారులో 105, 106 లెవల్ క్రాసింగ్ దగ్గర కోట్ల రూపాయలు వ్యయం చేసి అండర్ గ్రౌండ్‌రైల్వే వంతెనలు నిర్మించారు. వర్షపునీరు వెళ్లేందుకు సక్రమంగా పనులు చేయకపోవడంతో నీరు నిలిచి రాకపోకలు నిలిచిపోతున్నాయని సంబంధిత రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. అలాగే ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న 110లెవల్ క్రాసింగ్ వద్ద సైతం వంతెన నిర్మించగా వర్షపునీరు నిలిచి గత ఏడాది కారు మునిగిపోయిన సంఘటనతో వర్షాలు వస్తే చాలు వాహనచోదకులు సమాచార తెలుసుకుని ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. అలాగే వేముల గ్రామ శివారులో ఉన్న 112 లెవల్ క్రాసింగ్ దగ్గర సైతం అదే పరిస్థితి ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

ఈ ఏడాది అధికవర్షాలు రావడంతో నేటికిని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న అండర్‌గ్రౌండ్ రైల్వేవంతెనలో ఇప్పటి వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయని కాలినడకన వెళ్లలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాత్రి సమయాల్లో విషపురుగులు, పాములు వస్తున్నాయని రైల్వేఅధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుని గుంతలను పూడ్చాలని గువ్వలదిన్నె, ఇటిక్యాల గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. ప్రజల సౌకర్యార్థం అండర్ గ్రౌండ్ వంతెనలు దాదాపు ఒక్కోటి రూ.2.50 కోట్లతో నిర్మించినా సంబంధిత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రయాణికులు, రైతులు తెలుపుతున్నారు.

రాత్రివేళ ప్రమాదాలు జరుగుతున్నాయి



గోపలదిన్నె గ్రామ పరిధిలో రెండు అండర్ గ్రౌండ్ వంతెనలు నిర్మాణం చేపట్టగా అసంపూర్తిగా ఉన్నాయి. 105 లెవల్ క్రాసింగ్ దగ్గర వంతెన వర్షపు నీటితో నిండిపోయింది. పంట పొలాలకు వెళ్లాలన్నా రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. రైల్వే అధికారులు ఇప్పటికైనా పరిశీలించి సమస్యను త్వరగా పరిష్కరించాలి.

- అనంతరెడ్డి, గోపలదిన్నె

అసంపూర్తి పనుల వల్లే ఇబ్బందులు



అసంపూర్తి పనుల కారణంగా వర్షం వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతోపాటు రాత్రి సమయాల్లో పాములు వస్తున్నాయి. కాలినడకన వెళ్లలేకపోతున్నాం. వ్యవసాయ కూలీలు వంతెన కింది నుంచి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

- సుధాకర్, ఇటిక్యాల

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లోని ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వారి మండపంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, వివిధ రకాల పూలు, తోరణాలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం చేశారు. అనంతరం దంపతులు, భక్తులకు తీర్థప్రసాదాల అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

● తులసి పూజలు

గట్టు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా తులసి పూజలు నిర్వహించారు. తులసి కోటలకు అందగా అలంకరణలు చేసి, ఉసిరి దీపాలు, నేతి దీపాలు, నూనె దీపాలు వెలిగించారు. తులసిని లక్ష్మీస్వరూపంగా భావిస్తూ మహిళలు పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా మహిళలు తులసిపూజలు చేశారు. ఉసిరిచెట్టును తులసిలో పెట్టి పూజలు చేశారు. తులసి కోట చుట్టూ ముగ్గులు వేసి పండ్లు, పూలు పెట్టి తులసి పూజ నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం మహిళలకు వాయినాలు ఇస్తూ తులసిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

● శివ భక్తుల వనభోజనాలు

గట్టు మండలం మాచర్లలోని శివభక్తులు ఆదివారం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. శివునికి కార్తీకమాసం అంటే చాలా ఇష్టం ఈ మాసంలో ఉసిరి చెట్టుకింద పూజలు, వన భోజనాలు వంటివి చేస్తే అశ్వమేధ యాగంతో సమానమని పండితులు చెబుతుంటారు. ఉసిరి చెట్టులో మహావిష్ణువు, లక్ష్మీదేవి కొలువై ఉంటారని నమ్ముతారు.





గట్టు మండలం మాచర్లలో వన భోజనాలు చేస్తున్న శివభక్తులు, తులసి పూజ నిర్వహిస్తున్న మహిళలు

జొల్లు వ్యాధితో గొర్రెల మృత్యువాత

● దిక్కుతోచని స్థితిలో కాపరులు

● వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్న మూగజీవాలు

● రూ.లక్షల్లో ప్రాణనష్టం

● పట్టించుకోని అధికారులు



పైపాడులో గొర్రెల మంద

వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాల వల్ల గొర్రెలు, మేకలు, జొల్లు, గాలికుంటు వ్యాధితో బాధపడుతూ మృత్యువాత పడుతున్నాయి. మూగజీవాలు మృత్యువాత పడుతుండటంతో గొర్రెల కాపరులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి వడ్డేపల్లి మండలంలో మొత్తం 1,11,133 జీవాలు ఉన్నాయి. వర్షాలు అధికంగా పడటం వల్ల మేతకు వెళ్లిన జీవాల కాళ్లకు, మూతులకు పుండ్లు ఏర్పడి మృత్యువాత పడుతున్నాయని కాపరులు ఆవేదన చెందుతున్నారు. మెడికల్ షాపులకు వేల రూపాయలు వెచ్చించి మందులు తెచ్చి జీవాలకు టీకాలు వేసినా నయంకావడం లేదని చెబుతున్నారు. లక్షల్లో ప్రాణనష్టం జరుగుతుంది. ఒక్కొక్క గొర్రెల గుంపులో 30 నుంచి వంద గొర్రెల దాకా చనిపోయాయని కాపరులు తెలిపారు. ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కాకపోవడంతో మందుల షాపుల వారు జేబులు గుల్ల చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పశువైద్య డాక్టర్లకు తెలిపినా పట్టించుకోవడంలేదని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో పశువులకు నామమాత్రంగా టీకాలు వేస్తున్నారే తప్పా మిగతా సమయంలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా ఇంత పెద్దఎత్తున మూగజీవాలు చనిపోలేదని రైతుల వాదన. గొర్రెల కాపరులను అలా ఉంచితే గ్రామాల్లో ఉన్న ఆవులు, గేదెలకు రోగాలు వస్తే వైద్యులకు డబ్బులు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వ డాక్టర్లు సకాలంలో రాకపోవడం వల్ల గోపాలమిత్రలకు డబ్బులు ఇచ్చి రోగాలకు మందులు వేయించుకుంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. గాలికుంటు, జొల్లు వ్యాధులకు మందులు, టీకాలు వేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.

వంద గొర్రెల దాకా చనిపోయాయి



నావి, మా అన్నవి వంద గొర్రెల దాకా చనిపోయాయి. కురుస్తున్న వర్షాల వల్ల జొల్లు, గాలికుంటు వ్యాధితో ఎక్కువగా చనిపోతున్నాయి. గతంలో ఇంత పెద్దఎత్తున ఎప్పుడు గొర్రెలు చనిపోలేదు. రూ.10లక్షల దాకా నష్టం జరిగింది. గొర్రెల కాపరులపై పశుసంవర్ధక శాఖ అధికారులు జీవాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి.

- రాఘవేంద్ర, గొర్రెల కాపరి

పశువైద్యులు రావడం లేదు



నా గొర్రెల గుంపులో 30 గొర్లు మృత్యువాత పడ్డాయి. మూగజీవాలు మృత్యువాత పడుతున్నా పశువైద్య అధికారులు స్పందించడం లేదు. మందులు ఇవ్వకపోయినా సలహా ఇస్తే బాగుంటుంది. రూ.వేలు ఖర్చు పెట్టుకుని మందులు తెచ్చుకుంటున్నాము. మెడికల్ షాపుల వారు ఇచ్చిన మందులన్నీ వేసినా రోగం నయం కావడంలేదు. ఇక్కడ ఉన్న వైద్యులు చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు.

- మారెన్న, గొర్రెల కాపరి

కబడ్డీ పోటీల్లో వడ్డేపల్లి విద్యార్థుల ప్రతిభ



కబడ్డీ పోటీల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిన వడ్డేపల్లి విద్యార్థులు

వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 క్రీడా టోర్నమెంట్ (కబడ్డీ) పోటీల్లో వడ్డేపల్లి మండలానికి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం లభించిందని పీఈటీలు ఇద్రూస్ బాషా, వీరేశ్, మహేశ్వరి, స్వప్న ఆదివారం ప్రకటనలో తెలిపారు. టోర్నీలో వడ్డేపల్లి నవీన్, గణేశ్ జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కిశోర బాలికల సంఘాల సభ్యులకు ఆటల పోటీలు

గద్వాలసర్కిల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): అదనపు కలెక్టర్ ఆదేశానుసారం ఆదివారం గద్వాల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యాన ఆదివారం కిశోర బాలికల సంఘాల సభ్యులకు క్రీడాపోటీలు నిర్వహించారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో ఖోఖో, కబడ్డీ, పాటలు, కుర్చీ ఆటలు నిర్వహించారు. బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి సునీత, కోశాధికారి స్వాతి, ఏపీఎం దేవానందం, సీసీలు జయన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

గద్వాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హరిత హోటల్ సమీపంలో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనం నడిపిన ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేలా ఆడాలి



జోనల్‌స్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

● డీఎఫ్ఏ అధ్యక్షుడు బండల వెంకట్రాములు

గద్వాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో ఈనెల 3న జరిగే అండర్-17 జోనల్ ఫుట్‌బాల్ బాలబాలికల టోర్నమెంట్ కం సెలక్షన్‌లో జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని జిల్లా అసోసియేషన్ ఫుట్‌బాల్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. జోనల్‌స్థాయి పోటీల్లో జిల్లాలోని బాలబాలికలు జట్టు విజయానికి దోహదపడేలా రాణించి విజయం సాధించాలన్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఏ కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రవీణ్ సేవా సమితి అధ్యక్షుడు ఇండికా శివ, క్రీడాకారులు ఉన్నారు.

క్రీడలు జీవితంలో భాగం

అయిజ : క్రీడలు మానవ జీవనంలో ఒక భాగమని మండల బీజేపీ అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. బింగిదొడ్డి గ్రామములో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం 20 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు ఉచితంగా అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతీ క్రీడాకారుడు గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో క్రీడలు సాగాలని కోరారు.



క్రీడాకారులతో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గానికి ఆయా సందర్భంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లాస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వెంకటస్వామి, కనీస వేతనాల అమలు, కార్మిక హక్కుల పరిరక్షణ, ఉపాధికి భద్రత, సామాజిక పథకాల అమలుతో పాటు అనేక వాగ్దానాలు చేసినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. అదే సందర్భంలో కార్మిక చట్టాలను సవరిస్తూ హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుండటం గర్హనీయమన్నారు. సులభతర వాణిజ్యం పేరుతో కార్మికులను సేవకులుగా మార్చే ప్రయత్నం జరుగుతుండటం శోచనీయమన్నారు. గ్రామపంచాయతీ, మునిసిపల్, అంగన్‌వాడీ, ఆశా, ఐకేపీ తదితర యూనియన్లలో పనిచేసే వారికి కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఐక్యపోరాటాల ద్వారా మాత్రమే కార్మికులకు రక్షణ లభిస్తుందని, ఆ దిశగా అన్నిరంగాల్లోని కార్మికులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, అనుబంధ సంఘాల నాయకులు బాలకృష్ణ, రంగన్న, నరేశ్, రామకృష్ణ, తిరుపతన్న, ఆంజనేయులు, రఘు, లక్ష్మన్న ఉన్నారు.

రైతులకు రబీ బోనస్ చెల్లించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ జిల్లా కన్వీనర్ పల్లయ్య

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సంబంధించిన వరి బోనస్ డబ్బులు రైతులకు చెల్లించాలని జిల్లా బీఆర్‌ఎస్వీ కన్వీనర్ పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెసు ప్రభుత్వం మాటలతోనే ప్రజలను, రైతులను మభ్యపెడుతోందని విమర్శించారు. రైతులకు వరి కొనుగోలు సందర్భంగా క్వింటాకు మద్దతు ధర పోను అదనంగా ప్రభుత్వం తరపున బోనస్ కింద రూ.500 అందజేస్తానన్నారు. కానీ గత రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన వరి ధాన్యానికి బోనస్ కింద రూ.44,34,89,800 చెల్లించాల్సి ఉందని వివరించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది.

ఇప్పటివరకు ఇస్తానన్న బోనస్ రైతులకు అందచేయలేదని తెలియచేశారు. వారంలోగా రైతుకు అందచేయకపోతే రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు షైబు, వెంకటేష్, నర్సింహులు, లింగన్న, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు ఉంటే తెలపాలి : ఏడీఈ

గద్వాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 3వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీఈ రమేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల డివిజన్ పరిధిలో ఉన్న గద్వాల టౌన్, గద్వాల, ధరూరు, కేటిదొడ్డి మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పాల్గొనాలని, విద్యుత్ సమస్యలు ఉంటే నేరుగా తెలపాలని, లేదా దరఖాస్తు రూపంలో అందజేయాలని పేర్కొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు బెడ్‌షీట్లు, ప్లేట్లు పంపిణీ



బెడ్‌షీట్లు, ప్లేట్స్ ఇతర వస్తువులు అందుకున్న విద్యార్థులు

గద్వాలన్యూటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర వసతిగృహంలో ఆదివారం రెండో వార్డు మాజీ కౌన్సిలర్ లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులు 110 మంది విద్యార్థులకు రూ.40వేలు విలువ చేసే బెడ్‌షీట్లు, స్టీల్ ప్లేట్స్, గ్లాసులు, టోపీలు, పెన్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్‌కు సంబంధించిన మందడి భూపాల్‌రెడ్డి ప్రథమ వార్షిక వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని వసతి గృహంలోని విద్యార్థులకు కావలసిన వస్తువులను ఇచ్చేందుకు కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. దీంతో విద్యార్థులకు కావలసిన స్టేషనరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్స్‌లు పవన్, నరసింహులు, మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులు సాయిశ్యాం రెడ్డి, తదితరులు ఉన్నారు.